ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విజయనగరం

జిల్లా వార్తలు

గురువారం 9 మే 2024



పేదల అన్నంపై అంత కక్షనా?



విజయనగరంలోని అన్న క్యాంటీన్ భవనం



- నోటికాడ కూడు దూరం చేశావయ్యా జగనూ
- చౌకగా ఆహారం అందించే అన్న క్యాంటీన్ల మూత
- అప్పట్లోనే తీవ్రంగా వ్యతిరేకించిన కార్మికులు, కూలీలు
- ఆహా క్యాంటీన్లు ప్రారంభించి అభాసుపాలు







పేదల కడుపునింపే అన్న క్యాంటీన్లను వైసీపీ అధికారంలోకి వచ్చాక నిర్దాక్షిణ్యంగా మూసేసింది. ఒక పూట టిఫిన్, రెండు పూటల భోజనం చౌకగా అందించడంతో ఎంతోమంది పేదలు, కూలీలు, కార్మికులు, విద్యార్థులు రోజూ వాటిని ఆశ్రయించేవారు. రూ.5 చెల్లించి తృప్తిగా భోజనం చేసేవారు. ప్రభుత్వం మారాక చంద్రబాబుపై కక్షతో జగన్ వాటన్నింటినీ ఉన్నఫలంగా మూసేశారు. ఆ భవనాల్లో కొన్నింటిని ఇతర కార్యాలయాలకు ఉపయోగించారు. మిగతావాటిని అలాగే వదిలేశారు. అన్న క్యాంటీన్లు మూత పడ్డాక పేదల నుంచి చాలా వ్యతిరేకత వచ్చినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

అన్న క్యాంటీన్లలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం.. రాత్రి భోజనం. పూటకు రూ.5 చొప్పున మూడు పూటలూ కలిపి రూ.15కే ఆహారం లభించేది. రోజుకో రకమైన టిఫిన్ అందించడమే కాకుండా భోజనంలో వేడి అన్నం, కూర, సాంబారు, పచ్చడి, పెరుగు ఉండేవి. పరిశుభ్రమైన వాతావరణంలో ప్రత్యేకంగా నిర్మించిన భవనంలో భోజనం పెట్టేవారు. తక్కువ ధరకు రుచికరమైన భోజనం అందిస్తున్న కారణంగా అనతికాలంలోనే మంచి స్పందన వచ్చింది. వందలాది మంది అన్నక్యాంటీన్‌లకు వచ్చేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్కసారిగా వాటన్నింటినీ మూత వేశారు. అనేక సంక్షేమ పథకాలు మాదిరిగా పేర్లు మార్చి కొనసాగించినా పేద ప్రజల ఆకలిమంటలు ఆగేవి. కాని మూసివేతకే ప్రాధాన్యం ఇచ్చి బడుగులకు తక్కువ ధరకే భోజనం లేకుండా చేశారు. వీటిని కొనసాగిస్తే ఆ పేరు టీడీపీకే వెళ్తుతుందని భావించారో ఏమోగాని మూత వేసేందుకే నిర్ణయించారు. ఇది తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

కేంద్రాలు ఇలా..

అన్న క్యాంటీన్‌లు విజయనగరంలో రెండు ఉండేవి. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నీళ్ల ట్యాంక్ వద్ద ఒకటి, కార్పొరేషన్ కార్యాలయం వద్ద మరొకటి ఏర్పాటు చేశారు. వీటికి మంచి ఆదరణ లభించేది. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ల వద్ద యాచించే వారు కూడా క్యాంటీన్లను వినియోగించుకునేవారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఒక క్యాంటీన్ ఏర్పాటు చేశారు. నెల్లిమర్లలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ నిర్మాణ దశలో ఉంటుండగానే ఎన్నికలు వచ్చేశాయి. పూర్తి చేయకుండా వదిలేశారు. రాజాంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్ ఎత్తివేసి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంగా మార్చేశారు. గజపతినగరంలో ఓ ప్రైవేట్ భవనంలో అన్న క్యాంటీన్‌ను నిర్వహించారు. దీనిని కూడా మూసివేశారు. బొబ్బిలిలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను వైసీపీ ప్రభుత్వం మూసివేయగా మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బేబీనాయన కొనసాగిస్తున్నారు. ఎస్.కోటలోని అన్న క్యాంటీన్‌ను మూసి వేశారు. చీపురుపల్లిలో ఓ ప్రభుత్వ పాత భవనంలో ఉండేది. అక్కడా మూతపడింది.

- గ్రామీణ ప్రాంతాల నుంచి తెల్లవారగానే రైతులు కూరగాయలను మార్కెట్‌కు తెచ్చేవారు. వాటిని కొని చిరువ్యాపారులు వీధుల్లో తిరుగుతూ అమ్మేవారు. ఇరువురూ అన్నక్యాంటీన్లలో టిఫిన్ చేసేవారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు శిక్షణ పొందే నిరుద్యోగులు కూడా వాటిలోనే భోజనం చేసేవారు. ఇలా అన్ని వర్గాల పేదలకు అన్న క్యాంటీన్లు ఆకలి తీర్చేవి.

ఉదయాన్నే వచ్చేసేవాడ్ని..

మా గ్రామం నుంచి విజయనగరానికి ఇంటర్ చదువుకు వచ్చేవాడ్ని. ఉదయాన్నే వేగంగా క్యారేజీ పెట్టేందుకు అమ్మ ఇబ్బంది పడేది. అన్న క్యాంటీన్ వచ్చిన తరువాత క్యారేజీ గురించి ఆలోచనే లేకపోయేది. టిఫిన్, భోజనం అందులోనే చేసేవాడిని. ఎత్తేయడం నా లాంటి పేద విద్యార్థులకు ఇబ్బందే.

-రామకృష్ణ, విజయనగరం సమీప గ్రామం.

మెస్ బాధ ఉండేది కాదు..

విజయనగరంలో పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్నాను. మెస్‌లో భోజనం చేసేందుకు డబ్బులు ఉండేవి కావు. అన్న క్యాంటీన్‌కు వెళ్లి రూ.5కే భోజనం చేసేవాడ్ని. ప్రభుత్వం క్యాంటీన్లు ఎత్తివేయటం చాలా అన్యాయం. పేదలపై తీవ్ర ప్రభావం పడింది.

-బి.వెంకటనాయుడు, నిరుద్యోగి

వారంలోనే మూత..

రాజాం రూరల్: పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందంగా తయారైంది రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి. పేదలకు రూ.5 రూపాయలకే రుచికరమైన భోజనం అందించే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన అన్న క్యాంటీన్లను మూసివేసిన వైసీపీ ప్రభుత్వం.. వాటికి దీటుగా అంటూ ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామంది. జిల్లా కేంద్రంతో పాటు రాజాం, బొబ్బిలి మున్సిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలో గతేడాది ఆగస్టులో ఆహా క్యాంటీన్లను ఎంతో ఆర్భాటంగా ప్రారంభించింది. ఏమైందో ఏమో... పట్టుమని పదిరోజులు కూడా కొనసాగించలేదు. కొద్దిరోజులకే మున్సిపల్ అధికారులు ఎక్కడికక్కడ టెంట్లు పీకేశారు. వైసీపీ నేతలు ఆహా అంటూ ప్రారంభించి అభాసుపాలయ్యారు.



రాజాంలో ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే(ఫైల్)

నేడు చంద్రబాబు రాక

- చీపురుపల్లిలో రోడ్‌షో
- ఏర్పాట్లు పూర్తిచేసిన టీడీపీ శ్రేణులు

చీపురుపల్లి, మే 8: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు గురువారం చీపురుపల్లి రానున్నారు. ఉదయం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరగనున్న సభలో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్‌లో నేరుగా చీపురుపల్లి చేరుకుంటారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా రోడ్ షో నిర్వహిస్తారు. చంద్రబాబు రాకకు సంబంధించిన ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున బుధవారం పరిశీలించారు. ఆంజనేయపురంలో హెలిప్యాడ్ స్థలాన్ని పార్టీ నాయకులు కిమిడి సూరపునాయుడు, దివాకర్ తదితరులతో కలిసి సందర్శించారు. డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి, సీఐ షణ్ముఖరావు, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు కూడా హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు.





విజయనగరం: ఓటుపై అవగాహన ర్యాలీ

ప్రతి ఒక్కరూ ఓటేయండి

- ఎన్నికల పరిశీలకుడు తలాత్ పర్వేజ్
- విజయనగరంలో బైక్ ర్యాలీ

కలెక్టరేట్, మే 8: ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని జిల్లా సాధారణ పరిశీలకుడు తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లా కోరారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన బైక్ ర్యాలీని అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం స్వయంగా మోటర్ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు ప్రజాస్వామ్య మనుగడకు మూలాధారమన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ఈ మహా క్రతువులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని చెప్పారు. ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని చర్యలూ తీసుకుందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించేకోవాలని చెప్పారు. ఈ నెల 13న మహిళలు, యువత ఓటర్లంతా ముందుకు వచ్చి ఓటు వేయాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, సీపీవో బాలాజీ, జిల్లా సైనిక్ సంక్షేమాధికారి డాక్టరు సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చార్జీలు పెంచి.. డొక్కు బస్సులే ఉంచి

- జిల్లాలో ఫిట్నెస్ లేని ఆర్టీసీ బస్సులు
- 25 లక్షల జనాభాకు 165 లోపే సర్వీసులు
- నిత్యం కిక్కిరిసి ప్రయాణం

విజయనగరం (ఆంధ్రజ్యోతి), మే 8: జగన్ ప్రభుత్వం తమ సభలు, సమావేశాలకు ఆర్టీసీ బస్సులను నచ్చినట్టుగా వాడుకుంది. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా తరలించుకుపోయింది. బస్సుల సామర్థ్యం పెంచడానికి కాని కొత్త బస్సుల కొనుగోలుపై కాని దృష్టిసారించలేదు. ఫలితంగా జిల్లా ప్రజలు ఈ ఐదేళ్లలో సౌకర్యమైన ప్రయాణం చేయలేకపోయారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం.. సుఖప్రదం అని అందరూ భావిస్తారు. పూర్వం నుంచి ఈ నాటి వరకూ అదే నమ్మకంతో వాటిని ఆశ్రయిస్తున్నారు. అయితే బస్సుల సామర్థ్యం ప్రజల విశ్వాసానికి తగినట్టుగా ఉందా అంటే లేదనే సమాధానమే సర్వత్రా విన్పిస్తోంది.

జిల్లాలో తిరుగుతున్న అనేక ఆర్టీసీ బస్సులు ధ్రుడంగా లేవు. డొక్కు బస్సులు, సరిగా పనిచెయ్యని క్లచ్, గేర్లు, అరిగిపోయిన టైర్లు వెరసి ఎక్కడికక్కడ రోడ్డు మధ్యలో ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. జగన్ సీఎం అయిన తరువాత 2019 నుంచి ఇప్పటివరకు జిల్లాకు ఒక్క కొత్త బస్సు కూడా కొనలేదు. పాడైపోయిన బస్సులనే తిప్పుతున్నారు. సుమారు 25 లక్షల జనభా ఉన్న జిల్లాలో 2 డిపోల్లో 165 బస్సులు మాత్రమే ఉన్నాయి. అలాగే వీటిలో 8 నుంచి 10 బస్సులు రిపేర్లు, రిజర్వుడు పేరుతో ఉంచుతారు. ఎస్.కోట డిపోలో 50 బస్సులు వరకు ఉన్నాయి. వీటిలో కొన్ని రిపేరులో ఉన్నాయి. విజయనగరం డిపోలో కొన్ని కాలం చెల్లిన బస్సులు ఉన్నాయి. వాటిని ఇంకా తిప్పుతున్నారు. మధ్యలో ఆగిపోవటం, బస్సునుంచి శబ్దాలు రావడం.. టైర్లు పంచర్లు కావడం.. తదితర సమస్యలు వస్తున్నా వాటిని ఆపడం లేదు. ఇదిలా ఉండగా 2020-21 తరువాత అమాంతం ప్రతి టిక్కెట్‌పై రూ.5 పెంచేశారు. రూ.5 ఉన్న మినిమం టిక్కెట్ ధర రూ.10 చేశారు. సౌకర్యాలు పెంచలేదు. కొత్త బస్సులూ రాలేదు. మరోవైపు 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో 80 నుంచి 90 మంది దాకా ప్రయాణిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మరో 50 నుంచి 60 బస్సులు అదనంగా కావాలన్న ప్రతిపాదనలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ఐదేళ్లలో ఆర్టీసీని నిర్వీర్యం చేశారని అన్ని వర్గాలు ఆరోపిస్తున్నాయి.



ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు

- 3వేల మంది కేటాయింపు
- ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం, మే 8: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ దీపిక తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో బుధవారం సమీక్షించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వెంటనే నాయకులతో సమావేశం నిర్వహించి పోలింగ్ రోజున బూత్‌లకు నిర్దేశించిన దూరంలో ఉండాలని చెప్పాలని ఆదేశించారు. ఓటర్ స్లిప్పులపై ఎటువంటి రాజకీయ పార్టీలకు చెందిన గుర్తులు, పేర్లు ఉండకూడదన్నారు. పోలింగ్ రోజున 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేయాలని, ఇద్దరు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుంపులుగా ఉండకూడదని చెప్పారు. 200 మీటర్ల దూరంలో పార్టీల నాయకులు ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో ఓటు వేసే వ్యక్తులు మినహా ఇతర వ్యక్తులు ఉండరాదన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని చెప్పారు. పోలింగ్ ముగిసిన తరువాత గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు, వివాదాలు చెలరేగకుండా గస్తీ ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సమస్యలు సృష్టించే వ్యక్తులను మరోసారి పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు.



పోలింగ్‌కు పక్కా ఏర్పాట్లు

ఎన్నికల అధికారి నాగలక్ష్మి

కలెక్టరేట్, మే 8: ఎన్నికల రోజున పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండాలని ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. సెక్టార్ అధికారులతో బుధవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి సరైన ఆహారం సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన సమయానికి మాక్ పోల్ ప్రారంభమయ్యేలా చూడాలని చెప్పారు. సెక్టారులో ఉన్న అందరి ఫోన్ నెంబర్లు నోట్ చేసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్ వద్ద బారికేడ్లు, లైటింగ్, తాగునీరు పూర్తిస్థాయిలో సమకూర్చుకోవాలన్నారు. వందమీటర్లు, రెండు వందల మీటర్లు హద్దులను గుర్తించాలని, వందమీటర్ల బయట ఓటర్ అసిస్టెంట్ బూత్‌ను ఏర్పాటు చేసి బీఎల్‌వోలను ఇన్‌చార్జిగా పెట్టాలని తెలిపారు. సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్‌వో అనిత తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పూర్తి చేయాలి

పోస్టల్ ఓటింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. జేఎన్‌టీయులో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలను ఆమె బుధవారం పరిశీలించారు. వీలైనంత వేగంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. అలాగే ఎన్నికల రోజు ఏర్పాటు చేసే రిసెప్షన్ సెంటర్ వద్ద ఎలాంటి సమస్య రాకుండా చూసుకోవాలని ఇన్‌చార్జులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. నిర్దేశిత నమూనాలో కట్టుదిట్టంగా స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 13న ఎన్నికల జరుగుతున్నా దృష్ట్యా పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి 11వ తేదీ సాయంత్రం 7 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 7గంటల వరకూ మద్యం విక్రయాలపై నిషేధం ఉంటుందని, మద్యం దుకాణాలను మూసి ఉంచాలని కలెక్టర్ స్పష్టంచేశారు. అలాగే జూన్ 4వ తేదీన కౌంటింగ్ రోజు కూడా మద్యం దుకాణాలు మూసివేసి ఉంచాలని తెలిపారు.



ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

'స్థానిక' పోరును తలపించేలా..

(పాలకొండ)

గతంలో ఎన్నడూ లేని విధంగా సార్వత్రిక ఎన్నికల సమరం జరుగుతోంది. సాధారణంగా ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు గ్రామీణులు అంత ప్రాధాన్యం ఇవ్వరు. ఎన్నికల రోజుకు స్థానికంగా ఉన్న వారితోనే ఓట్లు వేయిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రం గ్రామాల్లోని ప్రతి ఓటరు వచ్చేలా చూస్తారు. ఈసారి ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం కావడంతో స్థానిక సమరాన్ని తలపిస్తున్నాయి. వలస వెళ్లిన వారిని ఎలాగైనా సొంత ప్రాంతాలకు తీసుకొచ్చి... ఓటు హక్కు వినియోగించుకొనేలా వివిధ పార్టీల అభ్యర్థులు ప్రణాళికలు రూపొందించారు. గతంలో కేవలం స్థానిక ఎన్నికల సమయంలోనే అభ్యర్థులు వలస ఓటర్లను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేసేవారు. ఈసారి అన్ని పార్టీల అభ్యర్థులూ వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్న ఓటర్లను తరలించేందుకు ఎంత మొత్తంలో చెల్లిస్తున్నారో... ప్రయాణ ఖర్చులు ఏ మేరకు భరిస్తున్నారో తెలుసుకుంటున్నారు. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి..వలస ఓటర్ల కోసం ఆరా తీస్తున్నారు. అంతకుమించి తాయిలాలు ఇచ్చి ఓటర్లను తెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే ప్రత్యేకంగా బస్సులు, ఇతర వాహనాలను కూడా నడుపుతున్నారు.



పండగలా ఉండేది

పెద్దల మాట

సాలూరు రూరల్: గతంలో ఎన్నికలు పండగలా ఉండేవి. ఎన్నికల గురించి అందరూ మాట్లాడుకునే వారు. ఎవరు నిలబడ్డారు? వారు ఎలాంటోళ్లు అని గుణగణాల కోసం చర్చించే వారు. పోటీలో నిలబడినోళ్లు ఊరిలో తిరిగి ఓటు అడిగే వారు. వీధుల్లో పెద్ద మనుషులు వారి గురించి చెప్పి ఓటు వేయమనే వారు. రిక్షాల్లో వెళ్లి ఓటు వేసి వచ్చేవారం. ఇప్పుడు ఎన్నికలలో గోలగోలగా ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల తీరు మారింది.

- గొట్టాపు బంగారమ్మ
(78), సాలూరు



ఓట్లు ఎలా అడగాలి దేవుడా!

● పనులు చేసినా.. పరపతి పోయింది ● ఆందోళన చెందుతున్న సర్పంచ్‌లు

(విజయనగరం)

వైసీపీ ప్రభుత్వ హయాంలో వందలాది మంది సర్పంచ్‌లు అప్పుల పాలయ్యారు. వేలాది రూపాయలు అప్పుచేసి పనులు చేసినా తమ పరపతిపోయిందని వాపోతున్నారు. సర్పంచ్‌గా గెలిచి ఊరికి రోడ్లు, తదితర అభివృద్ధి పనులు చేస్తామని చెప్పి చివరకు నిధులు రాక సొంత ఆస్తులు, వ్యవసాయ భూములు అమ్ముకుని పైసా లేకుండా పోయిందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎన్నికలు రావడంతో ప్రజల్లోకి ఎలా వెళ్లి ఓట్లు అడగాలని మదనపడుతున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రం ఎలాగైనా ఈసారికి గెలిపించాలని సర్పంచ్‌లను బతిమాలుతున్నారు. వివిధ మండలాల్లోని కొందరు సర్పంచ్‌లు తమ వ్యవసాయ భూములను తాకట్టు పెట్టగా... మరి కొందరు నాయకులు రూ.లక్షల్లో అప్పులుచేసి పనులు చేపట్టారు. చేసిన పనులకు బిల్లులు రాక తీవ్రంగా ఇబ్బందిపడుతూ పరపతి తెచ్చినచోట పరువు పోతోందని వడ్డీలు కడుతున్నారు. కొందరైతే బంగారు నగలు విక్రయించి అప్పులుతీర్చారు. ఐదేళ్లుగా నాయకత్వం వహించే వారు సర్పంచ్‌లను పట్టించుకోవడంలేదు. మూడేళ్ల కిందట సర్పంచ్‌గా పోటీచేయి నీకు అండగా ఉంటామని చెప్పిన నాయకులు.. తీరా లక్షలు ఖర్చయ్యాక కనిపించడం లేదుకదా.. జరిగే పనులకు బిల్లులు వస్తాయని డాంబికాలు పలికారు. వీరి తీరుతో విసిగిపోయిన కొందరు సర్పంచ్‌లు చాపకింద నీరులా కూటమి అభ్యర్థులకు మద్దతు పలుకుతున్నారు.



అక్కడ ఇద్దరు ఎంపీలు ఎమ్మెల్యేలు

● ఒకే రోజు ఏపీ, ఒడిశాల్లో పోలింగ్ ● సందిగ్ధంలో కొఠియావాసులు
● అధిక పోలింగ్ తమ వైపే జరిగేలా ఇరు రాష్ట్రాల ప్రతినిధుల యత్నం

(సాలూరు రూరల్)

ఏ ప్రాంతానికైనా ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తారు. ఏవోబీలోని కొఠియావాసులకు మాత్రం బ్రిటిష్ కాలం నుంచి ఇరు రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించడం విశేషం. స్వాతంత్ర్యం రాక ముందు కూడా కొఠియావాసులు అటు కలకత్తా ప్రెసిడెన్సీ, ఇటు మద్రాస్ ప్రెసిడెన్సీ పాలనలో ఉండేవారు. స్వాతంత్ర్యం అనంతరం 1952 నుంచి జరుగుతున్న ఎన్నికల్లో కొఠియావాసులకు ఏపీ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, ఒడిశా నుంచి ఎమ్మెల్యే, ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం కొఠియావాసులకు ఏపీ నుంచి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒడిశా నుంచి కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా, పొట్టంగి ఎమ్మెల్యే ప్రీతమ్ పాడీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఏవోబీలో ఉన్న కొఠియా గ్రూప్ 21 గ్రామాల్లో ఉన్న గిరిజనులను ఇరు రాష్ట్రాలకు చెందిన వారుగా పరిగణిస్తున్నారు. వారికి రెండేసి ఓట్లు, రేషన్ కార్డులు, ఇరు రాష్ట్రాల సంక్షేమ పథకాలు, విద్య, వైద్య, వ్యవసాయ తదితర అన్ని సౌకర్యాలు అందుతున్నాయి. కొఠియావాసులు సైతం ఇరు రాష్ట్రాల పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులకు తమ సమస్యలను చెప్పుకొని పరిష్కారం పొందడానికి ప్రయత్నిస్తారు.

ఒడిశా ముందు వరుసలో...

కొఠియాపై ఆధిపత్యానికి ఒడిశా ఒక అడుగు ముందులో ఉండి ఈ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రస్తుతం ఏపీ, ఒడిశాల్లో అసెంబ్లీలకు, లోక్‌సభకు ఎన్నికలు జరుగుతున్నాయి. అరకు, కొరాపుట్ లోక్‌సభ, సాలూరు, పొట్టంగి అసెంబ్లీ స్థానాలకు ఇరు రాష్ట్రాల్లో ఒకే రోజు మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ నుంచి అరకు ఎంపీగా బీజేపీ తరపున కొత్తపల్లి గీత, వైసీపీ నుంచి తనూజరాణి, సీపీఎం నుంచి పాచిపెంట అప్పలసరస తదితర 13 మంది పోటీ పడుతున్నారు. సాలూరు ఎమ్మెల్యేగా వైసీపీ నుంచి పీడిక రాజన్నదొర, టీడీపీ కూటమి అభ్యర్థిగా గుమ్మిడి సంధ్యారాణి, కాంగ్రెస్ నుంచి మువ్వల పుష్పారావు పోటీ పడుతున్నారు. కొరాపుట్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి సప్తగిరి ఉల్కా, బీజేపీ నుంచి కాళిరామ్ మాఝి, బీజేడీ నుంచి కౌసల్య హిక్కాక మరో ఇండిపెండెంట్ పోటీ పడుతున్నారు. పొట్టంగి ఎమ్మెల్యేగా బీజేడీ నుంచి ప్రఫుల్ కుమార్ పాంగి, కాంగ్రెస్ నుంచి రామచంద్ర కడెం, బీజేపీ నుంచి చైతన్య నందివాల మరో ముగ్గురు స్వతంత్రులు పోటీ పడుతున్నారు. కొఠియావాసులకు రెండు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలను ఎన్నుకోనున్నారు. రెండు రాష్ట్రాల్లో ఒకే రోజు ఎన్నికలు కావడంతో ఏ రాష్ట్రానికి అధికంగా వారి మద్దతు ఉంటుందోననే ఉత్కంఠ నెలకొంది. తమ రాష్ట్రానికి అధికంగా ఓటింగ్ జరిగేలా ఒడిశా సకల ప్రయత్నాలు చేస్తోంది. ఏపీ ప్రభుత్వం కొఠియావాసుల కోసం నేరేళ్లవలస, శిఖపరువు, కురుకూటిల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసింది. ఏపీ ఓటర్ల జాబితా ప్రకారం 2,554 మంది ఓటర్లు ఉన్నారు. ఒడిశా మాత్రం వారి గ్రామాలకు సమీపంగానే కొఠియా, పగులుచెన్నారు, ముడకారు, గంజాయిభద్ర, రణసింగి, గాలిగుబడారు, తావుపోదర్, గెమ్మెల పోదర్, తురియాలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసింది. ఒడిశా జాబితా ప్రకారం 5,502 మంది ఓటర్లు ఉన్నారు. కొఠియావాసులు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.



కొఠియా గ్రామం


కొఠియా గ్రూప్ ఎగువశెంబి గ్రామం

బొబ్బిలి ఖ్యాతిని ఇనుమడింపజేస్తా

● గ్రామాలను అభివృద్ధి చేసి చూపిస్తా
● జనమంతా నా ఆత్మబంధువులే!
● టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)

(బొబ్బిలి)

'బొబ్బిలికి చరిత్రలో ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఆ ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేసే విధంగా రాజకీయాలలో సేవలందించాలన్న లక్ష్యంతో పని చేస్తాను' అని బొబ్బిలి టీడీపీ- జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందితే ఏయే కార్యక్రమాలు చేపట్టాలో స్పష్టమైన అవగాహన ఉందని చెప్పారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..


బొబ్బిలి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు

సంపదను సృష్టించే సత్తా బాబుకే..

నారా చంద్రబాబు నాయుడుకు ఎంతో దూరదృష్టి ఉంది. సంపదను సృష్టించే సత్తా ఆయనకే ఉంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ధరలు ఆకాశాన్ని తాకాయి. యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయారు. ఇష్టారాజ్యంగా అప్పులు వాడేశారు. ఆఖరికి రిజర్వు బ్యాంకులో ఉన్న బాండ్లను వేలం వేసే అర్హతను సైతం కోల్పోయి, రాష్ట్రానికి ఎంతో అప్రతిష్ఠను మూటగట్టారు. నా ఒక్కడి పదవి కోసం ఓటు వేయాలని కోరుకోవడం లేదు. రాష్ట్రానికి మేలు జరగాలన్న దృక్పథంతో ఓటును వినియోగించుకోవాలి.

సొంత గడ్డకు సేవ చేయాలని వచ్చా

బాల్య దశలోనే నాకు బొబ్బిలిపై వల్లమాలిన అభిమానం. విజయనగరం జిల్లా కరువు ప్రాంతం. అన్నిటా వెనుకబడిన ప్రాంతం. మా తాతగారు ఆర్‌ఎస్‌ఆర్‌కే రంగారావు ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఈ ప్రాంతంలో విద్య, ఇరిగేషన్ పరంగా విశేష సేవలందించారు. ఆయన స్ఫూర్తితో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాం. ప్రతి గ్రామంలో మా మార్కు సేవకు చిహ్నంగా అనేక ఆనవాళ్లు కనిపిస్తుంటాయి. పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై కోపంతో పూర్తిగా మూసివేసింది. దీనితో అన్నార్తులంతా ఎంతో ఇబ్బందులు పడ్డారు. వారి కోసం సొంత డబ్బుతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నాం. రామభద్రపురం మండల కేంద్రంలో రైతుల కోసం అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేశాం. ఈ రాష్ట్రాన్ని జగన్ బీహార్ కన్నా అధ్వానంగా తయారు చేశాడు. ఆయన మాత్రం అన్ని ప్రాంతాలలో ప్యాలెస్‌లు కట్టించుకొని రూ.కోట్లు గడించాడు. ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాడు. ఓటు హక్కు పొందినవారంతా జాగృతులై రాష్ట్ర భవిష్యత్ కోసం విచక్షణతో వ్యవహరించాలి.

గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

జగన్ పాలనలో గంజాయి, డ్రగ్స్ మాఫియా పెరిగిపోయింది. దీనిని పూర్తి స్థాయిలో అరికట్టకపోవడంతో దేశానికి పెద్ద సంపద అయిన యువత పూర్తిగా నష్టపోతున్నారు. ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారిన నకిలీ మద్యాన్ని పారదోలి నాణ్యమైన మద్యం సరఫరా చేస్తాం. బొబ్బిలి పట్టణంలో అత్యాధునిక వసతులతో లైబ్రరీకి హంగులు కల్పిస్తాం. ప్రతి మండల కేంద్రంలో స్టడీ సర్కిల్స్‌ను ఏర్పాటు చేస్తాం. పాడైన రోడ్లకు టీడీపీ-జనసేన ప్రభుత్వ హయాంలో మహర్దశ ఉంటుంది. మాజీ సైనికోద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తాను.

పరిశ్రమలకు ఊపిరి పోస్తాం

బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్ సెంటరులో పరిశ్రమల ఏర్పాటు ముమ్మరం చేసి ఈ ప్రాంత ప్రజల కలలను సాకారం చేసేందుకు కృషి చేస్తాను. ఇందుకోసం అవసరమైన పారిశ్రామిక విధానం, విద్యుత్ పాలసీని ఎన్‌డీఏ కూటమి పకడ్బందీగా అమలు చేస్తుంది. మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేస్తా. చక్కెర కర్మాగారాన్ని నిర్వహించగలిగే సమర్థవంతమైన సంస్థలకు అప్పగించేందుకు కృషి చేస్తాను. ప్రభుత్వ సాయాన్ని అర్థిస్తాం. రైతులకు, కార్మికులకు మేలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం. ఇందులో రాజీ లేదు. అంతర్రాష్ట్ర ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న పారాది వేగావతి నదిపై బ్రిడ్జిని మా తాతగారి హయాంలో నిర్మించారు. బ్రిటీషు కాలం నాటి ఆ బ్రిడ్జి పూర్తిగా పాడైపోవడంతో మా సోదరుడు సుజయ్‌కృష్ణరంగారావు మంత్రిగా ఉన్నప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికీ దాని పనులు ప్రారంభం కాలేదు.

తాగు, సాగునీటికి ప్రాధాన్యం

లోచర్ల, రాముడువలస తోటపల్లి ఎత్తిపోతల పథకాలను మూలకు చేర్చారు. వైసీపీ హయాంలో ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. అధికారంలోనికి రాగానే తాగునీటి, సాగునీటి వనరులకు పెద్దపీట వేస్తాం. ప్రభుత్వ పరంగా జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు కృషి చేస్తాం. ఎన్టీఆర్ ప్రారంభించిన ప్రభుత్వ గురుకుల పాఠశాలను అభివృద్ధి చేస్తాం. చరిత్రాత్మకమైన ఐటీఐని అభివృద్ధి చేస్తాం. టిడ్కో ఇళ్లన్నిటినీ లబ్ధిదారులకు అప్పగిస్తాం. అక్కడ మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

అందరూ సమాన పౌరులే

ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులందరూ సమానమే. పేద-గొప్ప అనే తేడా లేదు. రాజుకు-రైతుకు జరుగుతున్న పోటీ అని చెప్పి ప్రజల్లో లేనిపోని భావాలను సృష్టించడానికి ప్రత్యర్థులు పన్నాగాలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు నన్ను, మా కుటుంబాన్ని ఆత్మబంధువులుగానే చూసుకుంటున్నారు. రైతు, వ్యవసాయం అంటే ఏమిటో తెలియని వారు సైతం వీటి గురించి చెప్పుకోవడం సిగ్గు చేటు. జనం మనిషిగా బేబీనాయన ముద్రపడిపోవడంతో ప్రత్యర్థులు చీప్ ట్రిక్స్ చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఏ ఊరు వెళ్లినా అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఉప్పొంగిన ఉత్సాహంతో ఆదరిస్తున్నారు. బొబ్బిలిలో తెలుగుదేశం పార్టీ విజయపతాకను ఎగురవేయడం ఖాయం.

పాతకు చెల్లుచీటీ.. కొత్తబాట పట్టి!

● ఎన్నికల ప్రచారంలో పెనుమార్పులు
● ఆటో ప్రచారాలు నామమాత్రం
● గోడలపై రాతలకు కాలం చెల్లు
● కరపత్రాల ఊసు లేదు
● ఇంటింటికీ తిరగడం పైనే అభ్యర్థుల ఆసక్తి

(చీపురుపల్లి)

ఎన్నికల ప్రచారం తీరు పూర్తిగా మారిపోయింది. గతంలో జరిగిన ప్రచారాలతో పోలిస్తే అభ్యర్థులు కొత్త విధానాలను అనుసరిస్తున్నారు. ప్రచారం పట్ల ప్రజల్లో అంతగా ఆసక్తి కనిపించకపోవడం ఒక కారణమైతే... మరో వైపు వ్యయ పరిమితి గరిష్ఠ స్థాయిని దాటిపోకూడదన్న ఉద్దేశంతో అభ్యర్థులు ఆచి తూచి అడుగులేస్తున్నారు. దీంతో ప్రచారంలో పాత పద్ధతులు కనుమరుగవుతున్నాయి. గతంలో నామినేషన్ల ఘట్టం ముగిసినప్పటి నుంచీ పోలింగ్ ముందు రోజు వరకూ ప్రధాన పార్టీల నాయకులు ప్రచారాన్ని హోరెత్తించేవారు. ఒకప్పుడు.. అంటే సుమారు నాలుగు దశాబ్దాల కిందట ఇనుప రేకులతో తయారు చేసిన ప్రింట్‌లపై, నీలి మందు రాసి గోడలపై అచ్చులు వేసేవారు. దీనిపై అభ్యర్థి పేరు, ఎన్నికల గుర్తు ఉండేవి. పోలింగ్ తేదీని కూడా ఎక్కువ ప్రచారం చేసేవారు. చాలా కాలం తరువాత ఈ విధానానికి స్వస్తి పలికారు. ఆ తరువాత, మండల కేంద్రాల్లో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభించి, ఉదయం నుంచి రాత్రి వరకూ మైకులతో గోల పుట్టించేవారు. మండల పరిధిలోని గ్రామాలకు పార్టీ జెండాలు, టోపీలు, బ్యానర్లు,ఇతర ఎన్నికల ప్రచార సామగ్రి ఈ కార్యాలయాల నుంచే పంపిణీ చేసేవారు. ఇవన్నీ కాకుండా ఒక్కో పార్టీ నుంచి కనీసం పది నుంచి పదిహేను వరకూ ఆటోలు, రిక్షాలు ఏర్పాటు చేసుకొని ఏ గ్రామాన్నీ, ఏ వీధినీ వదిలి పెట్టకుండా తిరిగేవారు. వేలాదిగా కరపత్రాలు పంచేవారు. గోడ పత్రికలు కూడా ముద్రించి అంటించేవారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా గోడలు ఖాళీగా కనిపిస్తే.. అభ్యర్థుల పేర్లను రాసి ప్రచారం చేసేవారు.



వ్యయంపై ఆంక్షలతో...

ప్రస్తుతం ప్రచారంలో ఆ హడావుడి కనిపించడం లేదు. కనీసం 2014 ఎన్నికల నాటి ప్రచారాల స్పీడు కూడా ప్రస్తుతం కానరావడం లేదు. వ్యయ పరిమితిపై ఎన్నికల కమిషన్ విధించిన నిబంధనలు దీనికి ప్రధాన కారణం. ఈ తరహా ఎన్నికల ప్రచారాలపై ప్రజలకు ఆసక్తి తగ్గడం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రచారం ఏ స్థాయిలో చేసినా... ఆఖరి రోజుల్లో చాప కింద నీరులా సాగే పంపిణీపైనే అభ్యర్థులు ఎక్కువగా నమ్మకం పెట్టుకోవడమే దీనికి ప్రధాన కారణం. దీంట్లో భాగంగా అభ్యర్థులు తమ ప్రచారంలో కొత్త పంథాను అనుసరిస్తున్నారు. డబ్బులు వెచ్చించి, మైకు సెట్లలో హోరెత్తించడం కంటే ఇంటింటి ప్రచారంపైనే మొగ్గు చూపిస్తున్నారు. ఇప్పటి వరకూ తమ హయాంలో జరిగిన పనులను అధికార పార్టీ నాయకులు, అభ్యర్థులు ప్రజలకు వివరిస్తుండగా.. ప్రతి పక్షం నుంచి పోటీకి నిలబడిన నాయకులు భవిష్యత్తులో తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో వివరిస్తున్నారు. కొంతమంది అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్న మహిళలు ప్రశాంతంగా గ్రామాల్లోకి వెళ్లి... మహిళా ఓటర్ల నుదుటన తిలకం దిద్ది.. ఓట్లు అడుగుతున్నారు. పార్టీ అధినాయకులు వచ్చిన సందర్భాల్లో తప్ప బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించడం లేదు. ఇది ఇలా ఉండగా.. ప్రచారంలో వచ్చిన మార్పులు కొంతమంది వృత్తిదారుల ఉపాధి అవకాశాలను దెబ్బ తీశాయి.

అన్నీ ఫోన్‌లో వద్దులే.. వాట్సాప్ కాల్ చేస్తా..!

([illegible])

[illegible] గురవుతున్నారు. ఫోన్ కాల్ కంటే వాట్సాప్ కాల్ ఉత్తమమని భావించిన అనేకమంది ఈ విధానాన్నే పాటిస్తున్నారు. ప్రస్తుతం రాజకీయంగా పలుకుబడి ఉన్నవారు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు వాట్సాప్ కాల్‌తోనే ఎక్కువ మాట్లాడుకుంటున్నారు.



9 జిల్లాలు దాటి వచ్చి ఓటు వేసి..

పాలకొండ, మే 8: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన ఉత్తరాంధ్ర ఉద్యోగ సంఘాల నాయకుడు భరత్ భూషణ్‌రాజ్ సతీమణి కావూరు రాజశ్రీ ఏలూరులో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. కొన్ని కారణాలు కారణంగా ఆమెకు బ్యాలెట్ ఓటు ఏలూరుకు ట్రాన్స్‌ఫర్ కాలేదు. దీంతో ఆమె ఎన్నికల విధుల శిక్షణ పూర్తి చేసుకుని బుధవారం బయలుదేరి పాలకొండ చేరుకున్నారు. ప్రజాస్వామ్యం తనకు కల్పించిన ఓటును బాధ్యత ఉన్న పౌరురాలిగా పాలకొండలో ఓటేసి తిరిగి ఏలూరు ప్రయాణమయ్యారు.

430 కిలోమీటర్లు దాటి ప్రయాణం

ఆమె 430 కిలోమీటర్ల దూరం సుమారు 9 గంటలు ప్రయాణం చేసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, అల్లూరి సీతారామ రాజు, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లా మీదుగా పార్వతీపురం మన్యం జిల్లాకు చేరుకున్నారు.



ఓటు వేసిన రాజశ్రీ

జన కేతనం
ఆంధ్రజ్యోతి
గురువారం 9 మే 2024



- ద్వితీయ శ్రేణి నాయకత్వంపై కన్ను
- వారిని ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు
- ఓటర్లను ప్రభావితం చేయగలిగే వారికి పెద్దపీట

వారే ముఖ్యం!

(శృంగవరపుకోట)

...ఇలా ఎన్నికల్లో అతితక్కువ ఓట్లతో జయాపజయాలు పొందిన వారెందరో ఉన్నారు. గతంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ కేవలం తొమ్మిది ఓట్లు తేడాతో గెలిపొందిన చరిత్ర ఉంది. దీనిని బట్టి ఓటు విలువను తెలుసుకోవచ్చు. ఇది సామాన్య జనాలకు పెద్దగా అర్థం కాకపోవచ్చు. బరిలో నిలిచే నేతలకిది బాగా తెలుసు. ఇలా చేయడంలో కీలక పాత్ర పోషించింది ద్వితీయ శ్రేణి నాయకత్వం. అందుకే ఇప్పుడు అభ్యర్థుల కన్ను ద్వితీయ శ్రేణి నాయకులపై పడింది. వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామినాయుడు 2009లో తప్ప ఓటమే ఎరుగని నేత. అప్పుడు కూడా కేవలం 597 ఓట్ల తేడాతోనే ఓటమి చెందారు. రద్దయిన భోగాపురం నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.

శృంగవరపుకోట శాసన సభకు ప్రాతినిధ్యం వహించిన ఎల్‌బీ దుక్కును మైదాన ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు 1999లో వ్యతిరేకించారు. దీంతో అతని స్థానంలో శోభా హైమావతికి టీడీపీ టికెట్ ఇచ్చింది. ఆమె కేవలం 678 ఓట్ల మెజార్టీతో గట్టెక్కారు.

తాయిలాలు ఇచ్చేందుకు...


మరో ఐదు రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి. దీంతో మండుటెండలో కూడా అభ్యర్థులు ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారంలో ఉంటున్నారు. ఓవైపు ఇలా ప్రచారం చేస్తూనే.. మరో వైపు ద్వితీయ శ్రేణి నాయకులతో సమావేశమవుతున్నారు. గ్రామ, మండల స్థాయి నేతలతో భేటీ అవుతున్నారు. తమ వైపు పనిచేసేలా ఒప్పించుకొనేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు వారేమడిగినా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ప్రత్యర్థి పార్టీలకు చెందిన వ్యక్తులను తమ వైపు తిప్పుకొనేందుకు చూస్తున్నారు. తమ పార్టీకి చెందిన నేతలతో తరచూ సమావేశమవుతున్నారు. సామాజిక వర్గాలవారీగా పది, ఇరవై ఓట్లు తేగలిగిన నేతలతోనూ ప్రత్యేకంగా కూర్చొంటున్నారు. ఉదాహరణకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీలక్ష్మి విశాఖ పార్లమెంట్ నుంచి వైసీపీ అభ్యర్థిగా రంగంలో ఉన్నారు. శృంగవరపుకోట శాసనసభ ఈ నియోజకవర్గం పరిధిలో ఉంది. దీంతో గతంలో ద్వితీయ శ్రేణి నాయకులకు ముఖం కూడా చూపించని ఆయన ఇప్పుడు పది ఓట్లు కూడా లేని వార్డు సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడుతున్నారు. స్వయంగా ఇంటికి రప్పించుకుంటున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులకున్న బలమిదేమరి. వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పూర్తిస్థాయిలో కనిపిస్తోంది. టీడీపీ వైపు ఓటు తరలితుందన్న నిర్ణయానికి వచ్చిన అధికార పార్టీ అభ్యర్థులకు ఓటు బ్యాంకును నిలబెట్టుకొనేందుకు ఇప్పుడు ద్వితీయ శ్రేణి నేతలు దిక్కయ్యారు. వారిని తమవైపు తిప్పుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు.



ఎస్.కోట మండలం బొడ్డవరలో ద్వితీయ శ్రేణి నేతలతో టీడీపీ ఆత్మీయ సమావేశం (ఫైల్)

అన్నిచోట్లా అలాగే...

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు.. ఎస్.కోట ఎమ్మెల్యే కె.శ్రీనివా సరావుకు మధ్య విభేదాలు ఉన్నాయి. మళ్లీ ఆయనకే టికెట్ ఇస్తే పనిచేయనని ఎమ్మెల్సీ బహిరంగంగానే చెప్పేవారు. అయినా వైసీపీ అధిష్ఠానం పట్టించుకోలేదు. దీంతో అతని వెనకున్న ద్వితీయ శ్రేణి నేతలంతా టీడీపీలోకి వెళ్లిపోయారు. ఇదే నియోజకవర్గంలో ఎన్ ఆర్‌ఐ గొంప కృష్ణ టీడీపీ నుంచి టికెట్ ఆశించారు. పార్టీ నిరాకరించడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. గెలుపుపై ప్రభావం పడే అవకాశం ఉండడంతో పార్టీ అధినాయకత్వం నచ్చజెప్పి పోటీ చేయకుండా నివారించింది. అతనితో పాటు మరికొంత మంది ద్వితీయ శ్రేణి నేతలను ఒప్పించి పార్టీ గెలుపునకు సహకరించేలా ఒప్పించింది. గజపతినగరం నియోజకవర్గంలోనూ మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడుకు టీడీపీ అధిష్ఠానం టికెట్ ఇవ్వలేదు. దీంతో అతను పార్టీ మారే ఆలోచన చేశారు. ప్రజాగళం యాత్రకు వచ్చిన అధినేత చంద్రబాబు బుజ్జగించడంతో పార్టీని గెలిపించేందుకు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో కిమిడి నాగార్జునకు టికెట్ ఇవ్వకుండా అతని పెదనాన్న, సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావుకు పార్టీ టికెట్ కేటాయించింది. దీంతో నాగార్జున అలిగారు. అతడిని చంద్రబాబు పిలిపించుకొని మాట్లాడారు. నెల్లిమర్ల నియోజకవర్గం పొత్తులో భాగంగా జనసేనకు వెళ్లింది. దీంతో అక్కడ టీడీపీ నుంచి టికెట్ ఆశించిన కర్రోతు బంగార్రాజు కినుక వహించారు. పొత్తు ధర్మాన్ని పాటించాలని అధినేత చంద్రబాబు నచ్చజెప్పడంతో దారికి వచ్చారు. వీరంతా వేలకు వేలు ఓట్లు కలిగి ఉన్న నాయకులు, అటు నుంచి ఇటు తిప్పేయగల సమర్థత ఉన్నవారు. వీరి వెనకున్న ద్వితీయ శ్రేణి నేతల ఆలోచన మారితే.. అభ్యర్థుల తలరాతలు మారిపోవడం ఖాయం. అందుకే వారెవ్వరూ బయటకు పోకుండా పార్టీ కాపాడి అభ్యర్థులకు అప్పగించింది. ఇప్పుడు అభ్యర్థులు వీరిని, వీరి అనుచర గణాన్ని ఓ కంట కనిపెట్టుకుంటూ, ప్రత్యర్థి పార్టీలో ఉన్న ద్వితీయ శ్రేణి నేతలను రాబట్టుకొనే పనిలో పడ్డారు. సొంత పార్టీలో ఉన్నా ఇంతవరకు సఖ్యత లేకపోయినా.. ఇప్పుడు వారి వద్దకు వెళ్లి దగ్గర చేసుకునే ప్రయత్నంలో పడ్డారు.



కుగ్రామం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు



కిమిడి కళావెంకటరావు



కిమిడి గణపతిరావు

(రేగిడి)

రేగిడి మండలానికి రాష్ట్ర రాజకీయాల్లో ఓ ప్రత్యేకత ఉంది. మండల కేంద్రం రేగిడి గ్రామం నుంచి రాష్ట్రనేతలను అందించిన చరిత్ర ఉంది. ఈ గ్రామం నుంచి ముగ్గురు రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. అంతేకాక రాష్ట్ర మంత్రులుగా పనిచేసిన నేపథ్యం ఉంది. వీరంతా కిమిడి కుటుంబీకులే కావటం గమనార్హం. వీరిలో కిమిడి కళా వెంకటరావు, ఆయన సోదరుడు కిమిడి గణపతిరావు, గణపతిరావు భార్య కిమిడి మృణాళినిలు ఉన్నారు. కళా వెంకటరావు ప్రస్తుతం చీపురుపల్లి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నారు. గతంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన కేబినెట్ మంత్రిగా.. టీటీడీ చైర్మన్‌గా.. రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన సోదరుడు గణపతిరావు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉణుకూరు నుంచి 1999లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గణపతిరావు భార్య కిమిడి మృణాళిని 2014లో చీపురుపల్లి నుంచి పోటీ చేసి బొత్స సత్యనారాయణపై గెలుపొందారు. ప్రస్తుతం గణపతిరావు దంపతులు క్రియాశీలక రాజకీయాల్లో లేకపోయినా వారి కుమారుడు కిమిడి నాగార్జున చురుగ్గా పని చేస్తున్నారు.



కిమిడి మృణాళిని

రాజాం సమగ్ర అభివృద్ధే ధ్యేయం

- తాగు, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తా
- ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కోండ్రు మురళీమోహన్

రాజాం: రాజాం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ స్పష్టం చేశారు. గత రెండు ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి ఓటు వేసిన ప్రజలు తప్పు చేశామని పశ్చాత్తాప పడుతున్నారని అన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో రాజాం నియోజకవర్గ ప్రజలు దారుణ వంచనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. 2009లో తొలిసారిగా రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యేగా, మంత్రిగా తన సేవలను గుర్తు చేసుకొని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. రాజాం మునిసిపాలిటీతో పాటు రాజాం, సంతకవిటి, రేగిడి ఆమదాలవలస, వంగర మండలాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



రాజాం నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్

పట్టణాభివృద్ధికి ప్రణాళిక

రాజాం... ఉమ్మడి శ్రీకాకుళంతో పాటు నేటి విజయనగరం జిల్లాలో మంచి పట్టణం. అభివృద్ధికి అవకాశం ఉన్న పట్టణం. కానీ గత పదేళ్లలో వైసీపీ ఎమ్మెల్యే ఎటువంటి అభివృద్ధి చేయలేకపోయారు. నేను మంత్రిగా ఉన్న సమయంలోనే రాజాం పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తుచేసుకోవాలి. గత ఐదేళ్లుగా రోడ్డు విస్తరణ పేరుతో కాలయాపన జరిగిందే కానీ.. అభివృద్ధికి ఎటువంటి ముందడుగు పడలేదు. అందుకే ఎమ్మెల్యేగా ఎన్నికైన మరుక్షణం రాజాం పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తా. అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా.

పక్కా రహదారులకు...

నియోజకవర్గంలో రహదారుల సమస్య తీవ్రంగా ఉంది. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు వాణిజ్య కేంద్రంగా ఉన్న రాజాంలోనే రహదారులు బాగాలేవు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో లింకు రహదారులు ఉన్నాయి. అటు ప్రధాన రహదారులు సైతం అస్తవ్యస్తంగా ఉన్నాయి. వాటిని బాగుచేసేందుకు నడుం కడతా. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పక్కా రహదారులు ఏర్పాటు చేస్తా.

సాగు..తాగునీటికి...

జిల్లాలో ఎక్కడా లేని సాగు, తాగునీటి వనరులు రాజాం నియోజకవర్గంలో ఉన్నాయి. తోటపల్లి, మడ్డువలస రిజర్వాయర్లతో పాటు నారాయణపురం ఆనకట్టకు సంబంధించి సాగునీటి కాలువలను ఆధునీకరిస్తాం. నియోజకవర్గంలోని శివారు ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం. రాజాం పట్టణానికి తాగునీటి ఇబ్బంది లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ప్రత్యేక ప్రాజెక్టులను తీసుకొస్తా.

వైద్య సేవలపై...

రాజాం ప్రభుత్వాస్పత్రిలో వసతులు మెరుగుపరుస్తా. నేను వైద్యారోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయిన విషయం గుర్తించాలి. ఏరియా ఆస్పత్రిగా.. ఈ ప్రాంతీయులకు సంజీవినిలా మార్చుతా. ఆస్పత్రుల్లో అదనపు భవన నిర్మాణాలతో పాటు వైద్యుల నియామకానికి కృషి చేస్తా. ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందించడమే నా లక్ష్యం. ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందితో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాను. ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తాం. ఇక్కడికి వచ్చిన రోగులకు వేరే ఆసుపత్రికి రిఫరల్ అన్నది లేకుండా అవసరమైన వైద్యసేవలు అందించేలా ప్రతి విభాగానికి వైద్య నిపుణులను నియమించేలా చర్యలు తీసుకుంటాను.

అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటా. ప్రజలకు అంకిత భావంతో సేవలు చేస్తా. ఏ సమస్య వచ్చినా ప్రజలకు అండగా ఉంటాను. 24 గంటలూ ఏ సమయంలో అయినా నా దగ్గరకు రావచ్చు. ప్రజలకు సేవలు అందించడమే నా లక్ష్యం.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా

నా ప్రాణం ఉన్నంత వరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రుణపడి ఉంటాను. నియోజకవర్గ నాయకులు, ప్రజలతో పాటు జనసేన, బీజేపీ నాయకులు కూడా నా విజయం కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నాను. రాష్ట్ర భవిష్యత్ కోసం నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంతో కష్టపడుతున్నారు. జిల్లాలోని రాజాం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా.

పరిశ్రమలను తెరిపిస్తా...

రాజాం నియోజకవర్గంలో మూతపడిన పరిశ్రమలను తెరిపించే ప్రయత్నం చేస్తా. సరైన ప్రోత్సాహం లేక పరిశ్రమలు మూతపడ్డాయి. వేలాది మంది కార్మికులు వీధిన పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి వాటికి ప్రోత్సాహకాలు అందేటట్టు చేస్తా. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తా. అందుకే ప్రజలు నాకొక అవకాశం ఇవ్వాలని కోరుతున్నా.

కూటమి అభ్యర్థుల విస్తృత ప్రచారం

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు దూసుకుపోతున్నారు. పల్లెలు, పట్టణాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. బుధవారం వివిధ నియోజకవర్గాల అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరి ప్రచారానికి జనం నుంచి మంచి స్పందన లభిస్తోంది. జియ్యమ్మవలస మండలం అల్లువాడలో కురుపాం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి, సాలూరులో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి, సీతానగరం మండలంలో పార్వతీపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర ప్రచారం చేశారు. గుర్ల మండలంలో చీపురుపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు, డెంకాడ మండలంలో నెల్లిమర్ల జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి నాగమాధవి, విజయనగరం మండలం లంకాపట్టణంలో టీడీపీ అభ్యర్థి అదితి, బాడంగి మండలంలో బొబ్బిలి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, రాజాం మండలంలో కోండ్రు మురళి సతీమణి శ్రీలక్ష్మి ఇంటింటా ప్రచారం చేశారు.



గుర్ల: మహిళలతో కలసి అభివాదం చేస్తున్న కిమిడి కళావెంకటరావు



బాడంగి: ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ప్రచారం



విజయనగరం: లంకాపట్టణంలో ప్రచారం చేస్తున్న అదితి గజపతిరాజు



సీతానగరం: ప్రచారంలో పాల్గొన్న విజయచంద్ర



సాలూరు: కూటమి అభ్యర్థి సంధ్యారాణికి హారతులిస్తున్న మహిళలు



జియ్యమ్మవలస: అల్లువాడలో కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరి ప్రచారం



డెంకాడ: మాట్లాడుతున్న కూటమి నెల్లిమర్ల అభ్యర్థి నాగమాధవి



రాజాం: ఇంటింటి ప్రచారం చేస్తున్న కోండ్రు మురళి సతీమణి శ్రీలక్ష్మి

అరాచక పాలనకు ముగింపు పలకండి: అశోక్



మాట్లాడుతున్న అశోక్

విజయనగరం రూరల్: రాష్ట్రంలో అరాచక పాలనకు ముగింపు పలికే ముహూర్తం ఆసన్నమైందని టీడీపీ సీనియర్ నేత, కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతి రాజు చెప్పారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజుకి మద్దతుగా నగరంలోని బోడ్డువారి జంక్షన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడారు. కంది మురళీనాయుడు, కంది శమంతక మణితో పాటు, ఆయా డివిజన్లకు చెందిన వారు అదితి గజపతిరాజుని గజమాల, తలపాగా, కత్తి వంటివి బహూకరించారు. వాటిని ఆమె ధరించి, అభివాదం చేశారు. ● విద్యలనగరంగా ఉన్న విజయనగరాన్ని గంజాయికి అడ్డాగా మార్చేశారని కూటమి విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బుధవారం 19వ డివిజన్ పరిధిలోని లంకాపట్టణం, బంగారమ్మ కాలనీ, సోమువీధి, బంగారి వీధి, రామమందిరం ఏరియా, రౌతువీధి, గోకవీధి, హుకుంపేట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమెకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పాటు, స్థానిక ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, ఇతర డ్రగ్స్ వాడకం వల్ల నేరాలు విజయనగరంలో పెరిగిపోతున్నాయన్నారు. ఇది భవిష్యత్ తరాలకు మంచిది కాదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనని, ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడిని గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ కౌన్సిలర్ సోము స్రవంతితో పాటు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. ● ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు అదితి గజపతిరాజు, కలిశెట్టి అప్పలనాయుడిని సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ అశోక్‌గజపతిరాజు చిన్న కుమార్తె విద్యావతీ దేవి కోరారు. నగరంలోని 14వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక సంపత్ వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆమె పులిగెడ్డ వారు వీధి, కూరెళ్లవారు వీధి, కురాకుల గట్టు తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

తోటపల్లికి నీరందిస్తాం: కళా

గుర్ల: చీపురుపల్లి నియోజకవర్గ రైతులకు తోటపల్లి నీరు అందించి సశ్యశ్యామలం చేస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకరావు అన్నారు. మండలంలోని చింతపల్లిపేట, పెనుబర్తి, తాతావారి కట్టాలి గ్రామాల్లో ఆయన బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తాగునీరు, వీధిలైట్లు కల్పిస్తానని, మేజరు పంచాయతీలో లైబ్రరీలతోపాటు ఉపాధి కోసం ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ హయాంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, అన్ని వర్గాల వారు ఎంతో నష్టపోయారన్నారు. తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని, రాష్ట్రం అభివృద్ధి బాట పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు, టీడీపీ మాజీ అధ్యక్షుడు కె.త్రిమూర్తులురాజు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నాయకుడు వి.సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు, కోట్ల సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు. ● పెనుబర్తి గ్రామంలో గ్రామ స్థాయి నాయకులు సన్యాసినాయుడు, అప్పలనాయుడు, సూర్యారావుల ఆధ్వర్యంలో వైసీపీని వీడి పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరినీ కళావెంకటరావు పార్టీలోకి ఆహ్వానించారు.



పెనుబర్తి గ్రామంలో మాట్లాడుతున్న కిమిడి కళావెంకటరావు

కూటమి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి: నాగమాధవి



కొండవెలగాడలో ప్రచారం నిర్వహిస్తున్న లోకం నాగమాధవి, ఆనంద్‌కుమార్

నెల్లిమర్ల: తనకు ఒక్క సారి ఎమ్మెల్యేగా గెలిపించి అవకాశం ఇస్తే అభివృద్ధి రుచి చూపిస్తానని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని టెక్కలి, చంద్రంపేట,చినబూరాడపేట,పెద్ద బూరాడపేట,పారసాం, కొండవెలగాడ గ్రామాల్లో ఆమె బుధవారం పర్యటించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఒక్క అవకాశం ఇస్తే తారక రామ తీర్థ సాగర్ రిజర్వాయర్‌ను పూర్తి చేసి తక్కువ కాలంలోనే ప్రజలకు తాగునీరు, సాగునీరు అందిస్తానని అన్నారు. ప్రతి గ్రామంలో మురుగు నీటి పారుదల వ్యవస్థను ఆధునికీకరిస్తానని, విద్యుత్ దీపాలను ఏర్పాటుచేసి చీకటి పారద్రోలుతానని అన్నారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, గేదెల రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: రాష్ట్రాభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని గొడ్డుపాలెం, వెదుళ్లవలస పంచాయతీల్లో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు ఆధ్వర్యంలో ఆమె బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధి తన బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, మాజీ జడ్పీటీసీ పతివాడ అప్పలనారాయణ, బూర్ల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఈ అరాచక పాలనను అంతం చేద్దాం





పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుజయ్ కృష్ణ, ప్రచారం చేస్తున్న రామ్‌నాయన

బొబ్బిలి, మే 8: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు చాలా అవసరమని బేబీనాయన సోదరులు కోరారు. బొబ్బిలి ఎన్‌డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన) గెలుపు కోసం ఆయన అన్నలిద్దరూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సుజయ్‌కృష్ణ రంగారావు బుధవారం పట్టణంలోని 27వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ అరాచకపాలను అంతమొందించేందుకు ఓటును ఆయుధంగా వినియోగించుకోవాలని హితవు పలికారు. టీడీపీ నాయకులు రాంబార్కి శరత్‌బాబు, పువ్వల శ్రీనివాసరావు, కన్నూరు అపర్ణశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ● బేబీనాయన మరో అన్న రామకృష్ణరంగారావు(రామ్‌నాయన) బుధవారం పట్టణంలోని మేదరబంద, ఓంకార్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో గల కళాసీ జట్లను కలుసుకున్నారు. బేబీనాయనను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు అందరూ సహకారం అందించాలని కోరారు. టీడీపీ నాయకులు బొబ్బాది తవిటినాయుడు, సాలా వసంత్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జేపీ సతీమణి ఆశీర్వాదం తీసుకున్న బేబీనాయన

బాడంగి: ముగడ గ్రామానికి ఎన్నికల ప్రచారం నిమిత్తం బుధవారం వచ్చిన బేబీనాయన దివంగ ఎమ్మెల్యే తెంటు జయప్రకాశ్ సతీమణి సత్యవతమ్మకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడుతో ముగడ, గజరాయనివలస, కామన్నవలస, గొల్లాది, డొంకినవలస ఆర్ఎస్, వీరసాగరం, రేజేరు, వాడాడ, కోటిపల్లి, బాడంగి, కోతూరు గ్రామాల్లో పర్యటించారు.

వైసీపీకి కాలం చెల్లింది: కోండ్రు

రాజాం: వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీ అన్నారు. బుధవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో పురపాలక సంఘం పరిధిలోని కొండంపేట గ్రామానికి చెందిన 30 వైసీపీ ఎస్సీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. కోండ్రు వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో దళిత జాతికి అన్యాయం జరిగిందన్నారు. మే 13న జరగబేయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. మండలం దోసరి రామినాయుడువలస గ్రామానికి చెందిన 20 వలస కుటుంబాలు కోండ్రు సోదరుడు జగదీష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. టొంపల ఆదినారాయణ, తులసీ, బోనుల తవుడు, లావేటి అప్పారావు, బొర్ల అప్పారావు, రేగాన ఈశ్వరరావు, శివ తదితరులు ఉన్నారు. దోసరి రామినాయుడువలస గ్రామానికి చెందిన గంట గణపతి, శంకరరావు, తలవరపు అప్పారావు, కరణం పురుషోత్తం, వండాల శ్రీనివాసరావు తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ● చంద్రబాబు నాయుడు పాలన వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కోండ్రు మురళీ సతీమణి శ్రీ లక్ష్మి తెలిపారు. పురపాలక సంఘం పరిధిలోని 4, 5, 10, 12 వార్డుల్లో బుధవారం ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతి అక్రమాలు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కోండ్రు మురళీని, ఎంపీగా కలిశెట్టి అప్పలనాయుడును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



పార్టీలో చేరిన వారికి పార్టీ కండువా వేస్తున్న కోండ్రు మురళీమోహన్

రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు: కోళ్ల



ప్రచారంలో అభివాదం చేస్తున్న కోళ్ల లలితకుమారి

కొత్తవలస: జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని కోళ్ల లలితకుమారి అన్నారు. ఎన్నికలు దగ్గర పడ్డంతో ఆమె మండలంలో బుధవార పర్యటన చేశారు. మండలంలోని నిమ్మలపాలెం, అప్పన్నలాలెం, దత్తి, ఉత్తరాపల్లి, అడ్డూరివానిపాలెం, గాంధీనగర్, జోగయ్యపాలెం, సింహాద్రిపాలెం, దెందేరు, గులివిందాడ, గనిశెట్టిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారలంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి విధ్వంస పాలనతో రాష్ట్రం అతలాకుతలమైపోయిందన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికే తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయన్నారు. రాష్టానికి గతంలో మంజూరు చేసిన అన్ని అభివృద్ధి కార్యక్రమాలు మళ్లీ మొదలవుతాయన్నారు. తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని, అన్ని వర్గాల వారు సంక్షేమ ఫలాలను అందుకుంటారన్నారు. లేదంటే రాష్ట్రం పూర్తిగా నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, ఇక అన్నీ మంచిరోజులేనని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుచేత ఉమ్మడి పార్టీ అభ్యర్థిగా తనను, విశాఖపట్టణం పార్లమెంటరీ నియోజకవర్గం అభ్యర్థిగా ఎం.భరత్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లలిత కుమారితో పాటు తెలుగదేశం, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

భోగాపురం: దల్లిపేట గ్రామానికి చెందిన దల్లి అప్పలరాముడు(65) ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పలరాముడు భార్య గతేడాది జూన్‌లో మృతి చెందింది. అప్పటి నుంచి అప్పలరాముడు విచారంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మంగళవారం ఉదయం అప్పలరాముడు ఇంటికి వారి బంధువు ఒకాయిన వెళ్లాడు. ఆయన వెళ్లేసరికి అప్పలరాముడు ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. నోటిలో నురగలు కూడా ఉన్నాయి. పక్కనే పినాయల్ డబ్బా ఉంది. దీంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానించి బంధువు చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పలరాముడు అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో నున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం కృత్రిమ అవయవాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కుమార్ రాజాగారి కుమారుడు తేజ బాబు జ్ఞాపకార్థం30 మంది దివ్యాంగులకు కృతిమ అవయవాలు,100 మంది విద్యార్థులకు స్టేషనరీ, 60 మంది వృద్దులకు ఉచితంగా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

రాజాం రూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అన్నివర్గాల ప్రజలు సహకరించాలని రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్ విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, పోలీస్ ఇతర శాఖల అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు.

వంగర: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసే వరకూ ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ శ్రీనివాసరావు కోరారు. బుధవారం రాత్రి సంగాం వీధుల్లో పర్యటించారు. పలువురితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ రచ్చబండపై ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై జనార్దనరావు తో పాటు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

విజయనగరం దాసన్నపేట: అమ్మా స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. బుధవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సేవా కార్యక్రమంలో ఇద్దరు నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వీలుగా అమ్మాసేవా సొసైటీ ప్రతినిధులు రూ. 10 వేలు, రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ నగదును కేసలి అప్పారావు చేతుల మీదుగా అందించారు.

హిందూ ధర్మానికి తూట్లు

రామభద్రపురం: హిందూ ధర్మానికి తూట్లుపొడుస్తూ ఇతర మతాల అభివృద్ధికి పాటుపడుతున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం మార్పు

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ హైస్కూలులో గత నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఆర్డీవో కార్యాయలానికి తరలించారు. గురువారం నుంచి ఆర్డీవో కార్యాలయంలోనే నిర్వహించనున్నారు. పోస్టల్‌బ్యాలెట్ ఇన్‌చార్జి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి సులోచనారాణి ఈ మేరకు ఓ ప్రకటనలో తెలియజేశారు.

వలంటీర్లను వాడుకున్నారు

బొబ్బిలి: రాష్ట్రంలో తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాలంటీర్ల వ్యవస్థను జగన్ ప్రభుత్వం వాడుకుందని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ఆర్‌వీ సుజయ్‌కృష్ణరంగారావు అన్నారు. పట్టణంలోని 27 వ వార్డుకు చెందిన ఇద్దరు మాజీ వలంటీర్లు తెలుగుదేశం పార్టీలో చేరడంతో వారికి బుధవారం కండువాలు వేసి సుజయ్ ఆహ్వానించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అందరికీ సంక్షేమం, అభివృద్ధే జరుగుతుందని ఆయన అన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యం

విజయనగరం రింగురోడ్డు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా వస్తుందని విజయనగరం పార్లమెంటు అభ్యర్థి బొబ్బిలి శ్రీను అన్నారు. బుధవారం బొబ్బిలి శ్రీనుకి మద్దతు తెలుపుతూ, ఇండియా కూటమి నుంచి సీపీఐ, సీపీఎం పార్టీలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెసానిక్ టెంపుల్లో కార్మిక సంఘాలతో ముఠా వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లాలో అనేక నీటిపారుదల ప్రాజెక్టులు పరిశ్రమలు మొదలుపెట్టారని, మళ్లీ కాంగ్రెస్‌ను గెలిపిస్తే, రాజన్న రాజ్యాన్ని తీసుకువస్తామన్నారు.

కూటమి మేనిఫెస్టోలో క్షత్రియులకు ప్రాధాన్యం

విజయనగరం రింగురోడ్డు: ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టోలో క్షత్రియులకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమని క్షత్రియ పరిషత్ కోశాధికారి గొట్టిముక్కల రామరాజు అన్నారు. బుధవారం క్షత్రియ కల్యాణ మండపంలో క్షత్రియ యూత్, క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2017లో నిరుపేద క్షత్రియులకు అవసరమైన కార్పొరేషన్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి, క్షత్రియ పరిషత్ చేసిన పోరాట ఫలితంగా 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ 50 కోట్ల రూపాయల నిధులను కేటాయించిందని, అయితే, ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడం వల్ల ఎవరికీ లబ్ధిచేకూరలేదని అన్నారు. క్షత్రియ కార్పొరేషన్ ప్రతినిధులు పెనుమత్స సీతారామరాజు, వెంకట రాజు, నాగరాజు వర్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

శృంగవరపుకోట రూరల్: ఎస్.కోట వైసీపీ వార్డు సభ్యురాలు కోసూరి భారతి, ఆమెతో పాటు మరో 300మంది మహిళలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బుధవారం టీడీపీ రాష్ట్రకార్యదర్శి ఇందుకూరి సుధారాజు వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వార్డుసభ్యురాలు భారతి మాట్లాడుతూ వైసీపీలో ఉండలేకపోయామని, టీడీపీలోనే తమకు న్యాయం జరుగుతుందని వచ్చామన్నారు. ఎంపీపీ సోమేశ్వరరావు, ఎస్.కోట సర్పంచ్ గనివాడ సంతోష్‌కుమారి, ఎంపీటీసీ వాకాడ సింహాచలం, నాయకులు మోపాడ గౌరినాయుడు, చిన్నికృష్ణ, దుల్ల రమణ, సిమ్మ అప్పారావు, వార్డుసభ్యులు కృష్ణవేణి, సూరిబాబు తదితరులున్నారు. ● **బొబ్బిలి:** బొబ్బిలి పట్టణానికిచెందిన మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ గునాన విజయలక్ష్మి బుధవారం తమ అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆహ్వానం మేరకు బేబీనాయన ఆమె నివాసానికి వెళ్లి తెలుగుదేశం పార్టీ కండువావేసి సాదరంగా ఆహ్వానించారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ల సిబ్బందికి, అధికారులకు రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ విధివిధానాలను వివరించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆమె వీటిపై అవగాహన కల్పించారు. నియమితులైన ప్రతీ ఒక్కరూ విధులను సక్రమంగా, అంకితభావంతో నిర్వహించాలన్నారు. మాక్‌పోలింగ్ సర్టిఫికెట్, ప్రిసైడింగ్ అధికారి నివేదిక ఫారాలను సరిచూసుకోవాలన్నారు. ఏఆర్‌వోలు త్రినాథరావు నాయుడు, రాజ్యలక్ష్మి, డీటీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బహుజనుల అభివృద్ధి బీఎస్పీతోనే సాధ్యం

విజయనగరం దాసన్నపేట: బహుజనుల అభివృద్ధి బీఎస్పీతోనే సాధ్యమని విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి పీరుబండి ప్రకాష్ అన్నారు. ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుజన సమాజ్‌పార్టీతోనే భారత రాజ్యాంగానికి రక్షణ కలుగుతుందన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఉండేవని, ఆ నిధులను కూడా ప్రభుత్వాలు పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీకి అందరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. బీఎస్పీ నాయకుడు సోము రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం లూటీ చేసిన జగన్

బొబ్బిలి: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దోచుకున్నాడని రాష్ట్ర జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక తాండ్ర పాపారాయ జంక్షన్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అధికారపార్టీ వైసీపీ ఎమ్మెల్యేల ఓట్లు చీల్చడమే తమ లక్ష్యమన్నారు.

వైసీపీతో విసిగిపోయారు



మాట్లాడుతున్న శ్రీనివాస్

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కీలకనేత శ్రీనురాజు (సంతరాజు) వైసీపీను వీడారు. బుధవారం ఎమ్మెల్యే అభ్యర్థి కేఏ శ్రీనివాస్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనురాజు మాట్లా డుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనతో ప్రజలు విరక్తి చెందారన్నారు. విజయనగరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, టీడీపీ నాయకులు కొత్తలి స్వామినా యుడు, కొత్తలి సూర్యారావు, తదితరులున్నారు.

దత్తిరాజేరు: పెదమానాపురం గ్రామంలో సూపర్‌సిక్స్ పథకాలపై తెలుగు మహిళలు ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ మహిళా మండల అధ్యక్షురాలు గేదెల మంగమ్మ, గంటా వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జామిలో కేఏ పాల్ సందడి



కుండ చూపిస్తూ మాట్లాడుతున్న కేఏ పాల్

జామి: మండల కేంద్రమైన జామిలో ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు, విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేఏ పాల్ సందడి చేశారు. బుధవారం జామి బజారు సెంటర్‌కు కారులో వచ్చిన కేఏపాల్ కారు పైకెక్కి ఒక మట్టి కుండను చూపిస్తూ కుండ గుర్తుపై ఓటువేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు చేతిలో రూ.లక్ష కూడా లేని బొత్స నేడు నేడు వేల కోట్లు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. ఆయన కుటుంబంలోనే ఎమ్మెల్యేలు, ఎంపీలను ఉంచుకుని వేల ఎకరాలు భూమిని దోచుకున్నారన్నారు. ఈసారి ఎన్నికల్లో ఫ్యాన్, సైకిల్, కమలం గుర్తులపై కాకుండా కుండ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా తనను గెలిపిస్తే అందరికీ ఉచిత విద్య, వైద్యం అందిస్తానని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుర్ల: భారతదేశంలో ప్రముఖ విద్యా సంస్థ అయిన ఇంటిన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, వెంకట గిరి తిరుపతి జిల్లాలో డిప్లమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా జౌళి శాఖ అధికారి మురళి తెలి పారు. కోటగండ్రేడు గ్రామంలో ఆయన గురువారం పర్య టించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళా శాలలో లేటరల్ ఎంట్రీ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ రెండు, మూడు సంవత్సరాల డిప్లమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు.జూన్ 1వ తేదీలోపు దరఖాస్తు చేయాలని కోరారు. వివరాలకు 93999936872, 9866169908, 9010243054 నెంబర్లకు సంప్ర దించాలని కోరారు.

చెరువు గట్టు చదును చేయడంపై అనుమానాలు

శృంగవరపుకోట: శృంగవరపుకోట రాచ్చెరువు గట్టు కింద ఉన్న భూమిని బుధవారం కొంత మంది వ్యక్తులు చదును చేస్తుండడంతో రైతులు ప్రశ్నించారు. చెరువుకు సంబంధించిన ప్రభుత్వ భూమి ఉన్నందున హద్దులు నిర్ణయించిన తరువాత చదును చేయాలని రైతులు వసంత సత్యారావు, నానిగిరి సూరిబాబు, చిప్పాడ సత్యం స్పష్టం చేశారు. అయినా ఆపకుండా చదును చేస్తుండడంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడ్డారు. ఉపతహసీల్దార్ భరత్ కుమార్, గ్రామ రెవెన్యూ అధికారిని పంపించి చదును చేయడం ఆపిస్తామని తెలిపారు.

అధ్వానంగా ఆండ్ర-గజపతినగరం రోడ్డు



ఆండ్ర- గజపతినగరం ప్రధాన రోడ్డు దుస్థితి ఇది. రోడ్లు ఇంత అధ్వానంగా ఉన్నా ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య స్పందించకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం (ఆంధ్రజ్యోతి)

ఓటు హక్కు వినియోగించుకోండి: ఎస్పీ



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

భోగాపురం: ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్పీ ఎం.దీపికాపాటిల్ పిలుపు నిచ్చారు. బుధవారం ముక్కాం గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు ఎటు వంటి భయబ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దని అన్నారు. జిల్లాలో ఓటింగు శాతాన్ని పెంచేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఓటర్లకు ఏమైనా ఇ బ్బందులు ఎదురైతే పోలీసులకు ఫిర్యాదులు చేయాలన్నారు. ఎన్నికల్లో ఎటువంటి అ వాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ ఎ.రవికుమార్, పోలీస్ సిబ్బంది, ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు గ్రామాలకు చెందిన ఓటర్లు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో 87.68 శాతం ఉత్తీర్ణత

కలెక్టరేట్: పాలిసెట్ ప్రవేశ పరీక్షలో జిల్లా వ్యాప్తంగా 87.68 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో బాలుర కంటే బాలికలు ఎక్కువ మంది ఉత్తీర్ణత సాధించారు. గత నెల 27న జరిగిన పరీక్షలో 7786 మంది పరీక్ష రాశారు. వీరిలో 6827 ఉత్తర్ణత సాధించారు.

29న జాతీయ లోక్ అదాలత్

రాజాం రూరల్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29న రాజాం కోర్టు సముదాయ ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. తన చాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ లోక్‌అదాలత్ గురించి వివరించారు. అదాలత్‌లో రాజీకి అనుకూలమై అన్ని క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్ కేసులను ఇరు పార్టీల పరస్పర అంగీకారంతో రాజీ చేయడం జరుగుతుందని జడ్జి తెలిపారు. రాజీకి వీలైనన్ని ఎక్కువ కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవాలని జడ్జి ఆనంద్ శ్రీనివాస్ కక్షిదారులను కోరారు.

